నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 14 అక్టోబర్ 2024 | JAGTIAL

# జీఎస్టీ భారీ స్కామ్ పై విచారణ




- పది నెలల క్రితం వెలుగులోకి తెచ్చిన 'నమస్తే తెలంగాణ'
- కూపీలాగితే కదులుతున్న డొంక
- వివిధ రాష్ట్రాల్లో కంపెనీల గుర్తింపు
- ఇప్పటివరకు రూ.11కోట్ల రికవరీ

జగిత్యాల, అక్టోబర్ 13(నమస్తే తెలంగాణ): వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో జగిత్యాలకు చెందిన ఓ ట్యాక్స్ కన్సల్టెంట్ పెద్ద మొత్తంలో స్కామ్ చేయడం పది నెలల క్రితం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. చట్టంలో ఉన్న చిన్నచిన్న లొసుగులను ఆధారంగా చేసుకొని ఏకంగా 32 సూట్‌కేస్ కంపెనీలను సృష్టించి వాటి పేరిట రూ.288 కోట్ల లావాదేవీలు నిర్వహించగా, ఈ విషయంపై గతేడాది డిసెంబర్‌లో 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు రాసి వెలుగులోకి తీసుకువచ్చిన విషయం విధితమే. ఈ క్రమంలోనే జగిత్యాల పోలీసులు సదరు ట్యాక్స్ కన్సల్టెంట్‌ను అరెస్ట్ చేశారు. జగిత్యాలకు చెందిన చంద్రా పాస్కు మార్ జీఎస్టీ ప్రాక్టీషనర్ అయినందున ఎవరైనా కొత్తగా వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయాలన్నా, వివిధ కారణాలతో వ్యాపార సంస్థలు మూయాలన్నా ఆయన్నే సంప్రదించేవారు. ఈ క్రమంలోనే సదరు ట్యాక్స్ కన్సల్టెంట్ అతడి వంకర బుద్ధికి పదును పెట్టాడు. వ్యాపార సంస్థలు మూసివేయడానికి వ్యాపారస్తుల పాన్ నంబర్లు, ఆధార్ నంబర్లు సమర్పించాల్సి ఉంటుంది. అలా సమర్పించిన పాన్‌నంబర్లు, ఆధార్‌నంబర్ల ఆధారంగా వ్యాపార సంస్థను మూసివేయకుండా ఫోన్‌నంబర్లు మార్చి జీఎస్టీ చట్టంలో ఉన్న లొసుగులను వాడుకొని 32 బోగస్ కంపెనీలను తెరిచి వాటి ద్వారా వ్యాపారాలు కొనసాగుతున్నట్లు వాణిజ్య పన్నుల శాఖకు సమర్పించాడు. క్షేత్రస్థాయిలో ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించకుండానే, కాగితాలపైనే లావాదేవీలు నడుపుతున్నట్లు చూపించి తప్పుడు పత్రాలను జీఎస్టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. ఇందులో అత్యధిక జీఎస్టీ స్లాబ్ ఉన్న సిమెంట్, ఐరన్ వ్యాపారం చేసినట్లు కాగితాల్లో చూపించాడు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తర్వాత విచారణ అంతా హైదరాబాద్‌లోని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ పరిధిలోకి చేరింది. వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వాణిజ్య పన్నుల శాఖ పరమైన విచారణతో పాటు, పోలీస్‌శాఖ సైతం విచారణలోకి దిగింది. తీగలాగితే డొంక కదిలినట్లు ప్రస్తుతం అధికారులు విచారణ చేపడుతుండడంతో వివిధ రాష్ట్రాల్లోని పలు కంపెనీలు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ బాగోతంలో 5 రాష్ట్రాలకు చెందిన డీలర్ల ఖాతాలను స్తంభింపజేయడం ద్వారా ప్రభుత్వం సొమ్మును కొంత వరకు కట్టడి చేయగలిగినట్లు సమాచారం. జీఎస్టీ ప్రాక్టీషన్‌ను అరెస్ట్ చేసిన అధికారులు ఇప్పటి వరకు రూ.11కోట్లు వివిధ కంపెనీల నుంచి రికవరీ చేసినట్లు తెలుస్తోంది. బోగస్ సంస్థల ఖాతాల్లో జమ అయిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మొత్తాన్ని తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రా, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిస్సా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన దాదాపు 350 మంది వ్యాపారులకు బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ ట్యాక్స్ కన్సల్టెంట్ ద్వారా ఐటీసీ లబ్ధిపొందిన వారిలో తెలంగాణ రాష్ట్రంలో 302 మంది వ్యాపారస్తులు ఉండగా, మరో 48 మంది వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లు జీఎస్టీ అధికారులు గుర్తించారు. ట్యాక్స్ కన్సల్టెంట్ బోగస్ వ్యవహారంలో 32 బోగస్ కంపెనీల నుంచి రూ.288 కోట్ల ఐటీసీని దాదాపు 350 మంది ట్యాక్స్ పేయర్లకు బదిలీ అయినట్టు నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో అత్యధికంగా రూ.120 కోట్ల ఐటీసీ మొత్తం ఆర్మూర్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఒక బోగస్ ఫర్మ్‌కు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. మిగిలిన మొత్తం హైదరాబాద్‌లోని పంజాగుట్ట, చార్మినార్, సరూర్‌నగర్‌లో గల బోగస్ కంపెనీలకు ఐటీసీ బదలాయింపు జరిగినట్లు అధికారులు నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. ట్యాక్స్ ప్రాక్టీషనర్ ఏర్పాటు చేసిన బోగస్ కంపెనీల నుంచి ఇన్‌పుట్ క్రెడిట్ ట్యాక్స్ పంపి ఆయా వ్యాపార సంస్థల నుంచి 20శాతం, అంతకంటే ఎక్కువ మొత్తాన్ని కమిషన్ కింద పొందేవారని అధికారులు తెలిపారు. కాగా, భారీ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన కంపెనీలు, ఏపీ రాష్ట్రంలో ఈ కంపెనీలు ఉన్నాయి, వాటి పాత్ర, వాటిలోకి జమచేయబడిన ఇన్‌పుట్ సబ్సిడీ తదితర వివరాలన్నింటినీ అందజేయాలని కోరుతూ వాణిజ్య పన్నుల శాఖ జగిత్యాల అధికారి ఆనందరావు రాష్ట్ర డీజీపీకి ఇటీవల లేఖ రాసినట్లు సమాచారం. కాగా, వాణిజ్య పన్నుల శాఖతో పాటు, పోలీసుశాఖలు సంయుక్తంగా ఈ స్కామ్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో త్వరలోనే చార్జీ షీట్‌ను దాఖలు చేయనున్నట్లు సమాచారం.

## అంబరాన్నంటిన దసరా సంబురాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. భక్తుల ప్రత్యేక పూజలు, వాహన, శమీ పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి. జమ్మి ఆకు పెద్దలకు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు అందజేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో మహిషాసుర సంహారాన్ని కన్నుల పండువలా నిర్వహించారు.

- కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 13



కరీంనగర్: మార్క్‌ఫెడ్ మైదానంలో విల్లు ఎక్కుపెడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన మేయర్ సునీల్‌రావు

# ఉద్యోగులపై బీఆర్ఎస్ కరుణ కాంగ్రెస్ కాఠిన్యం

నాడు తెలంగాణ ఇంక్రిమెంట్‌తో సహా రెండు విడుతల్లో 73 శాతం ఫిట్‌మెంట్

దేశ చరిత్రలోనే అత్యధికంగా ఇచ్చిన ముఖ్యమంత్రిగా కేసీఆర్ రికార్డు

- నేడు డీఏ చెల్లింపునకు ముప్పు తిప్పలు
- మేనిఫెస్టోలోని హామీలకు చెదలుపట్టిస్తున్న రేవంత్ సర్కారు
- మండి పడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు
- కేసీఆర్ సర్కారుకు, రేవంత్ ప్రభుత్వానికి మధ్య తేడాపై ఉద్యోగుల్లో చర్చలు




ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా నిలిచే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కాంగ్రెస్ సర్కారు కాఠిన్యం ప్రదర్శిస్తోంది. గద్దెనెక్కడానికి ఎన్నికలకు ముందు ఇష్టానుసారం హామీల వర్షం కురిపించిన నాటి టీపీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్నీ మరిచి పోయినట్లు కనిపిస్తోంది. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణం చెల్లిస్తామని, కొత్త పీఆర్సీ ప్రకటించి.. ఆరు నెలల్లోపు సిఫారసులు అమలు చేస్తామని ఏకంగా మేనిఫెస్టోలో ప్రకటించింది. అంతే కాకుండా, అనేక రకాల హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఒక్కటి కూడా ఆచరణలో అమలు చేయకపోవడంపై ఉద్యోగులు భగ్గుమంటున్నారు. కానీ, గతంలో కేసీఆర్ అధికారం చేపట్టిన వెంటనే.. ఉద్యోగులకు అండగా నిలిచారు. ఫ్రెండ్లీ గవర్నమెంట్ పేరుతో వారిపై కరుణ చూపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు విడుతల్లో 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. తమ కోసం అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకున్న విషయాన్ని ప్రస్తుతం ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఆశపడి గోస పడుతున్నామన్న ఆవేదన వారిలో కనిపిస్తోంది.

- కరీంనగర్, అక్టోబర్ 13, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### ఉద్యోగుల పెన్నిధిగా నడిచిన కేసీఆర్

స్వరాష్ట్రంలో సంక్షేమాన్ని పరుగులు పెట్టించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. అందులో భాగస్వాములైన ఉద్యోగులకూ అదే ప్రాధాన్యత ఇచ్చారు. అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి మొదలు.. చివరి వరకు ఉపాధ్యాయ, ఉద్యోగులతో ఫ్రెండ్లీ ప్రభుత్వాన్ని నడుపుతూనే ఉద్యోగులు సగర్వంగా తలెత్తుకునేలా వేతనాలు పెంచారు. గత రెండు పీఆర్సీల్లో దేశంలోనే అత్యధిక ఫిట్‌మెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కింది. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షన్ దారులకు పెంచిన వేతనాలు, ఇచ్చిన ఫిట్‌మెంట్‌లు, పెరిగిన గ్రాట్యుటీ, అలవెన్స్‌లు, ఇతర సౌకర్యాలను ఒకసారి నెమరువేసుకుంటే.. కేసీఆర్ ఉద్యోగులకు ఎలా అండగా నిలిచారో అర్థమవుతుంది. ప్రభుత్వ పగ్గాలు చేపట్టగానే 2014లోనే తెలంగాణ ఇంక్రిమెంట్‌ను పూర్తికాలం పనిచేసేలా ఇచ్చారు. ఉద్యోగుల పోరాటాన్ని గుర్తించి ఇంక్రిమెంట్ ఇచ్చిన ఘతన కేసీఆర్‌కే దక్కింది. 2014 పీఆర్సీలో భాగంగా వేతన స్కేళ్లను సవరించిన ప్రభుత్వం.. ఉద్యోగుల అంచనాలకు భిన్నంగా 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి ఉద్యోగులపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. 43 శాతం ఫిట్‌మెంట్ అనేది ఒక చారిత్రాత్మక నిర్ణయం. ఇక్కడితో ఆ ప్రస్థానం ఆగలేదు. 2018 పీఆర్సీకి సంబంధించిన నివేదికను 2020 డిసెంబర్ 31న ఆనాటి కమిటీ చైర్మన్ బిస్వాల్ ప్రభుత్వానికి సమర్పించారు. ఏడు శాతం ఫిట్‌మెంట్ పెంచడానికి కమిటీ సిఫారసు చేయగా.. ఆ నివేదికను పక్కన పెట్టి.. అసెంబ్లీ సాక్షిగా 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి కేసీఆర్ అనాడే ఉద్యోగులపై మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. స్వరాష్ట్రంలో రెండు పీఆర్సీల ద్వారా 73 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కింది. దేశంలోని బీజేపీ, కాంగ్రెస్ పాలిత ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్దమొత్తంలో ఫిట్‌మెంట్ నేటి వరకు పెంచలేదు. భవిష్యత్‌లో పెంచుతారన్న సూచనలు కూడా కనిపించడం లేదు. నిజానికి సమైక్య రాష్ట్రంలో వైఎస్సార్ హయాంలో 16 శాతం, చంద్రబాబు హయాంలో 25 శాతం ఫిట్‌మెంట్ మాత్రమే ఆనాటి ప్రభుత్వాలు ప్రకటించాయి. కానీ, కేసీఆర్ మాత్రం వీటికి భిన్నంగా ముందుకు వెళ్లారు. చివరగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ చైర్మన్‌గా పీఆర్సీ కమిటీని నియమిస్తూ ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 159ను జారీ చేసిన విషయం తెలిసిందే. నివేదికను ఆరు నెలల్లోపు ఇవ్వాలని నిర్దిష్ట గడువు పెట్టడంతోపాటు.. 5 శాతం మధ్యంతర భృతి(ఐఆర్)ని చెల్లించాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికలు జరగడం.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఫిట్‌మెంట్ ఒక్కటే కాదు.. 2014కు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల గ్రాట్యుటీ రూ.8 లక్షలు ఉంటే దానిని 2014లో రూ.12 లక్షలకు 2018 పీఆర్సీలో రూ.16 లక్షలకు పెంచింది. కేసీఆర్ సర్కారు హయాంలో గ్రాట్యుటీ డబుల్ అయింది. ఉపాధ్యాయ. ఉద్యోగుల కోరిక మేరకు రాష్ట్రంలో ఏదేని ఒక కేటగిరీలో పదోన్నతి పొందాలంటే మూడేండ్ల సీనియార్టీ ఉండగా, ఈ పరిమితిని రెండేండ్లకు తగ్గిస్తూ.. 2021 ఆగస్టు 30న జీవో నంబర్ 259ని జారీ చేసింది. స్పౌజ్ కేటగిరీలో భార్యాభర్తలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. అలాగే, కారుణ్య నియామకాలు, రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఉద్యోగులందరినీ తెలంగాణకు తీసుకొచ్చింది. కొత్త జిల్లాల ఏర్పాటు, తద్వారా ఏర్పడిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, కోర్టులు వంటి వాటితో వేలాది మంది ఉద్యోగులకు పదోన్నతుల అవకాశం ఏర్పడేలా చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 15 శాతం అదనపు పెన్షన్ కోసం వయో పరిమితిని 75 ఏళ్ల నుంచి 70 ఏళ్లకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ విరమణ వయసును 58 నుంచి 61కి పెంచి 2021 మార్చి నుంచి అమలులోకి తెచ్చింది. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల వైద్య పరీక్షలకు గరిష్ట పరిమితి ఎత్తివేసింది. ప్రభుత్వంలో టీఎస్ ఆర్టీసీ విలీనం చేయడం ద్వారా 43 వేల మంది కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మార్పు జరిగేలా చర్యలు తీసుకుంది. ట్రావెలింగ్ కన్వేయన్స్, ట్రాన్స్‌పోర్టు అలవెన్సును 30 శాతం పెంచింది. బిడ్డ పెళ్లికి అడ్వాన్స్ రూ.4 లక్షల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇల్లు కట్టుకోవాలనే వారికి అడ్వాన్స్ పెంపు, బదిలీపై వెళ్లే ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ 30 శాతం, షెడ్యూల్ ఏరియాలో పనిచేసే వారికి 30 శాతం అలవెన్సులను ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం పెంచింది. ఇవేకాదు.. మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇలా చెప్పుకుంటూ వెళ్తే.. అడుగడుగునా ఉద్యోగుల సంక్షేమంపై ఆనాడు కేసీఆర్ దృష్టిపెట్టారు.




### కాఠిన్యం చూపుతున్న కాంగ్రెస్ సర్కారు

ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు సంబంధించి.. ఎన్నిలకు ముందు కాంగ్రెస్ అనేక హామీలు గుప్పించింది. ఏకంగా మేనిఫెస్టోలో అనేక హామీలను పొందుపరిచింది. బీఆర్ఎస్ సర్కారు కంటే గొప్పగా ఉద్యోగుల సంక్షేమంపై శ్రద్ధచూపుతామని పేర్కొంది. కానీ, ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. కనీసం ఉద్యోగ సంఘాలతో చర్చించి.. హామీలను అమలుచేసే సమయాలు చెప్పడం లేదు. ఎన్నికల ముందు మాట్లాడిన తీరుకు.. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు అసలు పొంతన లేదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించడమే కాకుండా ప్రధానంగా పెడింగ్‌లో ఉన్న మూడు డీఏలను అధికారం చేపట్టిన వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఆ డీఏల సంఖ్య ప్రస్తుతం ఐదుకు చేరినా.. నేటి వరకు ప్రభుత్వం దానిపై నోరు మెదడపం లేదు. దసరాకు వస్తాయని భావించిన ఉద్యోగులకు నిరాశే ఎదరైంది. ఇప్పుడు దీపావళికి ఇస్తామన్నట్లుగా ప్రభుత్వం సంకేతాలు ఇస్తోంది. అయితే, స్పష్టత మాత్రం లేదు. దీపావళికైనా వస్తాయా? లేదా? అన్న దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చే డీఏలను సకాలంలో ప్రకటించి బకాయిలను నేరుగా ఉద్యోగులకు చెల్లిస్తామని ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి, ఆరు నెలల్లోపు సిఫారసుల అమలు చేస్తామని గొప్పలు చెప్పింది. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌తో అన్ని రకాల జబ్బులకు అన్ని దవాఖానాల్లో వైద్యం అందించే విధంగా హెల్త్ కార్డు జారీ చేస్తామనిపేర్కొంది. ఇందులో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. ప్రధానంగా రాష్ట్రంలో గత మార్చి నుంచి ప్రతి నెలా వెయ్యి వంది వరకు ఉపాధ్యాయ, ఉద్యోగులు రిటైర్డ్ అవుతున్నారు. వీరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాల్సి ఉంది. వీటి కోసం దరఖాస్తు చేసుకొని.. ఆరు నెలలు దాటుతున్నా వారికి ఆర్థిక ప్రయోజనాలు చేకూరడం లేదు. నిజానికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వస్తాయని ప్రతి ఉద్యోగి వివిధ రకాల ప్లాన్స్ చేసుకొని ఉంటారు. కానీ.. గత మార్చి నుంచి నేటి వరకు.. రిటైర్ అవుతున్న ఏ ఒక్కరికీ బెనిఫిట్స్ అందక ఆందోళన చెందుతున్నారు. వివిధ అసరాల కోసం తెచ్చిన అప్పులకు ఉద్యోగులు వడ్డీలు కడుతున్నారు. ఇది మచ్చుకు మాత్రమే.. ఇటువంటి అనేక అంశాల్లో కాంగ్రెస్ సర్కారు కాఠన్యమే చూపుతోంది. ఈ నేపథ్యంలోనే.. నాటి కేసీఆర్ సర్కారుకు.. నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బేరీజు వేసుకుంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దారులు చర్చించుకుంటున్నారు. ఆశకు పోతే గోస పడుతున్నామనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం.. ఇక ఉద్యమ బాట పట్టాల్సిందేనని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా.. ఇదే బాటలో పెన్షన్‌దారులు ముందుకు వెళ్తున్నారు.

## కిలో మీటర్ మేర..

రేణికుంట టోల్‌గేట్ వద్ద వాహనాల బారులు

తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు కిలోమీటర్ మేర బారులు తీరుతున్నాయి. బతుకమ్మ, దసరా పండుగ పూర్తవడంతో సొంత గ్రామాలకు వచ్చిన వారు హైదరాబాద్ బాట పడుతున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు జామ్ అయ్యాయి. పలువురు వాహనదారులు ఇబ్బంది పడగా.. సిబ్బంది త్వరగా పంపించారు.

- తిమ్మాపూర్, అక్టోబర్13



రేణికుంట టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

# వస్త్రపరిశ్రమలో సంక్షోభం




సిరిసిల్ల టెక్స్‌టైల్స్ పార్కు ముఖద్వారం

- కాంగ్రెస్ సర్కారు పాపం.. సిరిసిల్ల నేతన్నకు శాపం
- బతుకమ్మ చీరల ఆర్డర్లులేక ఆగమైన బతుకులు
- మూలకుపడ్డ సాంచాలు.. కుటుంబాల్లో ఆకలికేకలు
- విద్యుత్ చార్జీల్లో సబ్సిడీలు, రీయింబర్స్‌మెంట్ ఎత్తివేత
- తాజాగా టెక్స్‌టైల్స్ పార్కులో మూతపడ్డ యూనిట్లు
- 1500 మంది కార్మికుల జీవితాలు రోడ్డుపాలు

కార్మిక క్షేత్రం తల్లడిల్లుతున్నది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో కన్నీరుపెడుతున్నది. నాడు చిక్కి శల్యమై బీఆర్ఎస్ ప్రభుత్వంలో పునర్జీవం పోసుకొని కార్మికులకు చేతినిండా పనితో ఓ వెలుగు వెలిగిన వస్త్రపరిశ్రమ మళ్లీ సంక్షోభంలోకి వెళ్లిపోతున్నది. ప్రభుత్వ చేయూత లేక, వస్త్ర ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రాక మాంద్యంలో చిక్కుకున్నది. బతుకమ్మ చీరల ఆర్డర్లు లేక పట్టణంలో సాంచాలు నడవక ఉపాధి కోల్పోయి వందలాది మంది బతుకులు ఆగమైపోవడం, అన్నమో రామచంద్రా..! అంటూ ఇప్పటికే పది మంది కార్మికులు బలవన్మరణం చెందడం పరిస్థితికి అద్దంపడుతున్నది. ఓ వైపు పని లేక మరమగ్గాలు తుక్కుకింద అమ్ముకుంటున్న యజమానులను పుండుమీద కారంచల్లినట్టు మరో భారం మోపింది. విద్యుత్ చార్జీల్లో సబ్సిడీలు, రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసి కోలుకోని దెబ్బతీయగా, కరెంట్ బిల్లు భారాన్ని భరించలేమంటూ వస్త్ర ఉత్పత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే టెక్స్‌టైల్స్ పార్కులోని యూనిట్లను మూసివేయడంతో 1500 మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): నాటి పాలనలో చితికిపోయిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు జీవం పోసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు ప్రవేశపెట్టి సాంచాలకు పూర్వవైభవం తీసుకొచ్చింది. బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్‌ను సిరిసిల్లకే ఇస్తూ చేతి నిండా పని, పనికి తగ్గ కూలీ వచ్చేలా చర్యలు తీసుకున్నది. తెలంగాణతోపాటు బిహార్, గుజరాత్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కార్మికులకు ఉపాధి లభించింది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వక పోవడంతో మరమగ్గాలు మూతపడ్డాయి. వేలాది మంది ఉపాధి కోల్పోయారు. వస్త్ర పరిశ్రమలో సంక్షోభం పునరావృతమైంది. గత ప్రభుత్వం సిరిసిల్ల పట్టణంలోని మరమగ్గాలను కుటీర పరిశ్రమగా గుర్తించి మూడో కేటగిరీ కింద చేర్చి యూనిట్ విద్యుత్ బిల్లు రూ.8లో రూ.2 సబ్సిడీ ఇచ్చింది. ఇక గ్రామీణ ప్రాంతంలో ఉన్న తంగళ్లపల్లి మండలం సారంపల్లిలోని టెక్స్‌టైల్స్ పార్కులో యూనిట్లకు మాత్రం యూనిట్ విద్యుత్ బిల్లు రూ. 8లో రూ.4 రీయింబర్స్‌మెంట్ ఇచ్చింది. యజమానులకు ఎంతో మేలు జరిగింది. కార్మికులకు చేతినిండా పనిదొరికింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం వీటన్నింటినీ నాలుగో కేటగిరి కిందకు మార్చి సబ్సిడీ, రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేసింది. నేతన్న పొట్టకొట్టింది. కొత్త ఆర్డర్లు రాక ప్రత్యామ్నాయం లేక పట్టణంలోని యజమానులు వస్త్ర ఉత్పత్తులను నిలిపివేశారు.

### యూనిట్ విద్యుత్ రెండు రూపాయలే

ఇతర రాష్ట్రాలలో టెక్స్‌టైల్స్ రంగానికి వినియోగించే విద్యుత్ యూనిట్‌కు రూ.2 మాత్రమే వసూలు చేస్తున్నారు. వేలాది మందికి ఉపాధి కల్పించే వస్త్ర ఉత్పత్తుల పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం యూనిట్‌కు రూ.8 వసూలు చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం పట్టణంలోని సాంచాలకు రూ.2 సబ్సిడీ ఇవ్వగా, టెక్స్‌టైల్స్‌పార్కులో యూనిట్లకు రూ.4 చొప్పున రీయింబర్స్‌మెంట్‌తో చేయూత నిచ్చింది. పక్కనున్న కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రభుత్వాలు యూనిట్ విద్యుత్ రెండు రూపాయలకే ఇస్తూ ప్రత్యేక జీవోలు ఇచ్చాయి. దీంతో తయారైన వస్త్రాలు అక్కడ చాలా చౌకగా లభిస్తుండగా, సిరిసిల్లలో తయారైన వస్త్రాలకు రేటు ఎక్కువ కావడంతో మార్కెట్‌లో పోటీ పడలేక పోతున్నారు. అక్కడి మాదిరే విద్యుత్ ఇస్తే తప్ప విఫణిలో పోటీని తట్టుకోవడం సాధ్యం కాదంటున్నారు. అక్కడి ప్రభుత్వాలు టెక్స్‌టైల్స్ రంగానికి అందిస్తున్న సహకారం ఇక్కడి ప్రభుత్వం కూడా ఇవ్వాలని కోరుతున్నారు. రూ.8కోట్ల రీయింబర్స్‌మెంట్ రావాల్సి ఉంది. తొమ్మిది నెలలు అవుతున్నా ఇంత వరకు సెస్‌కు విద్యుత్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయలేదు.



వస్త్ర ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలేక సిరిసిల్ల టెక్స్‌టైల్స్ పార్కులో మూతపడ్డ యూనిట్లు

### మూత పడ్డ టెక్స్‌టైల్స్ పార్కు..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం సారంపల్లిలోని టెక్స్‌టైల్స్ పార్కులోనూ తలెత్తింది. గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లతో ఎనిమిదేళ్లుగా నిరంతరం నడిచిన పరిశ్రమ నేడు బంద్‌పెట్టే పరిస్థితికి వచ్చింది. యజమానులు సొంతంగా తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాక మాంద్యమం ఏర్పడింది. తయారైన వస్త్రాలు అమ్ముడుపోక ఉత్పత్తులను నిలిపివేశారు. మీటరుకు రూపాయి నష్టం వస్తున్నట్లు యజమానులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలి ప్రాజెక్టుగా పేరుగాంచిన ఈ పార్కులో వారం రోజుల క్రితం యూనిట్లను మూసివేశారు. మొన్నటిదాకా 104 యూనిట్లు ఉండేవి. ఒక్కో యూనిట్లో 15నుంచి 25వరకు ఆధునిక రేపియర్ మరమగ్గాలుండగా, అవి సగానికి తగ్గిపోయాయి. 46యూనిట్లు పూర్తిస్థాయిలో మూతపడ్డాయి. 58యూనిట్లలో 850 మాత్రమే నడిచాయి. అవి కూడా మూత పడి వారం రోజులవుతున్నది. టెక్స్‌టైల్స్ పార్కులో స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 1500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. యూనిట్లు మూతపడడంతో సొంతూళ్లకు వెళ్లిపోయారు. టెక్స్‌టైల్స్ పార్కు నడుస్తుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### పరిశ్రమ నడపలేకపోతున్నం..



వస్త్ర పరిశ్రమలో తీవ్ర మాంధ్యం నెలకొంది. తయారైన వస్త్రాలకు మార్కెట్ లేక, గిట్టుబాటు ధర రావడం లేదు. కరెంటు బిల్లులు చెల్లించలేక భారమై యూనిట్లు మూసేశాం. ఎన్ని రోజులన్నది ఇదమిద్దంగా చెప్పలేం. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి ప్రోత్సహించింది. ఏడాదిలో ఎనిమిది నెలల పాటు నిరంతరాయంగా యూనిట్లు నడిపించి కార్మికులకు చేతి నిండా పని కల్పించాం. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరల స్థానంలో మహిళా సంఘాలకు చీరల తయారీ ఆర్డర్లు ఇస్తామంటున్నది. అవి ఎప్పుడు ఇస్తారో? ఎన్ని మీటర్లు ఇస్తారో స్పష్టత లేదు. మేము తయారు చేస్తున్న వస్త్రాలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర వస్తే యూనిట్లు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- కళ్యాడపు సుభాష్, వస్త్ర ఉత్పత్తి దారు

### రీయింబర్స్‌మెంట్ రద్దు చేసిన్రు..



టెక్స్‌టైల్స్ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు యూనిట్‌కు రెండు రూపాయలు వసూలు చేస్తున్నయ్. మన రాష్ట్రంలో మాత్రం యూనిట్‌కు రూ.8 వసూలు చేస్తున్నరు. ఇది మాకు భారమైతున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇచ్చింది. రూ.4 మాత్రమే చెల్లించినం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేసింది. ప్రభుత్వం చేయూతనివ్వకపోవడం, మరోవైపు మార్కెట్ లేక మాంధ్యం నెలకొనడంతో యూనిట్లు మూసేసినం. పార్కులో చాలా యూనిట్లు మూతపడ్డయ్. 58 యూనిట్లు మాత్రమే నడుస్తున్నయ్. అవి కూడా వారం రోజుల క్రితం నుంచి మూసివేయడం జరిగింది. టెక్స్‌టైల్స్ రంగం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ సహకారం అవసరం. ఇతర రాష్ట్రాల మాదిరిగా విద్యుత్ రాయితీ ఇవ్వాలని కోరుతున్నం.

- అంకారపు కిరణ్, జనరల్ సెక్రటరీ, సిరిసిల్ల టెక్స్‌టైల్స్ పార్క్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్

# డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్!

- సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం
- దసరా సెలవులకు ముందే నిర్ణయం తెలిపిన యాజమాన్యాల సంఘం
- ఆందోళనలో విద్యార్థులు



శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధికంగా మూసివేయాలని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు దసరా సెలవులకు ముందే సమాచారం ఇచ్చారు. శాతవాహన పరిధిలో 60కి పైగా కళాశాలలు ఉండగా, దాదాపు రూ.120 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్టుగా తెలుస్తున్నది.

- కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 13

### సర్వత్రా ఆందోళన

డిగ్రీ, పీజీ కాలేజీలను మూసివేయాలని శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధుల నిర్ణయం అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నది. ప్రైవేట్ విద్యా సంస్థలు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యాబోధన అందిస్తున్న డిగ్రీ, పీజీ కాలేజీలపై ఆర్థిక భారం తీవ్రంగా పడుతున్నందున ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకున్నా, అప్పులు తీసుకొచ్చి కాలేజీలను నిర్వహిస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు తలకు మించిన భారంగా మారినందున కళాశాలలను తిరిగి తెరిచే పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు. అయితే, ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి పలు మార్లు తీసుకువెళ్లినా స్పందన లేకుండా పోయిందని, రెండేళ్లుగా నిధులు విడుదల కాకున్నా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే కళాశాలలు నిర్వహిస్తున్నామని, ఇకపై విద్యార్థులకు చదువులు చెప్పేందుకు సుముఖంగా లేమని యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.